క్లుప్తంగా

అక్రమ కేసులపై బహిరంగ చర్చకు సిద్ధం

గన్నవరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ పోలీస్ కేసులు పెట్టడంపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేసిన సవాల్ మేరకు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో వచ్చిన ఏడాది కాలంలో నియోజకవర్గంలో వందలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని చెప్పారు. టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు పునఃవిచారణ పేరుతో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను ఏ71 చేర్చారని తెలిపారు. ఈ ఘటనతో సంబంధం లేని ఎంతో మంది కార్యకర్తలను కేసులో ఇరికించారని తెలిపారు. సత్యవర్ధన్ కిడ్నాప్ ఆరోపణలతో పాటు మరో పది వరకు అక్రమ కేసులు వంశీమోహన్, పార్టీ శ్రేణులపై పెట్టారని చెప్పారు. వీటిని సాక్ష్యాధారాలతో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

యోగా దినోత్సవంలో పాల్గొనండి



పెనమలూరు: ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పాల్గొనాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పి.భవానీప్రసాద్ అన్నారు. పోరంకి సచివాలయం- 3లో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 1వ తేదీ వరకు కానూరు మహదేవపురం కాలనీ సుధా కమ్యూనిటీ హాల్‌లో యోగాపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని తెలిపారు. యోగాలో పాల్గొనే వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ డి.రసూల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మందు బిళ్లల పంపిణీ



పెనమలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి తాడిగడప శ్రీనగర్‌కాలనీలో దంత సమస్యలు, ఫ్లోరోసిస్ బాధితులకు సోమవారం మందు బిళ్లలను పంపిణీ చేశారు. జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ బద్రీనాథ్ శ్రీనగర కాలనీ వాసులకు మల్టీ విటమిన్, విటమిన్ సీ ట్యాబ్‌లెట్లను అందజేశారు. ఈ ప్రాంతంలో గతంలో బాధితులకు రీ హేబిలిటేషన్ సామగ్రి కూడా అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ పురుషోత్తమరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



కంకిపాడు: దోమల నిర్మూలనతో మలేరియా నివారణ సాధ్యమవుతుందని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అంజు అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా ఉప్పలూరు పీహెచ్‌సీ పరిధిలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అంజు మాట్లాడుతూ దోమలనిర్మూలన, పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో దోమల నిర్మూలన చర్యలు చేపడుతున్నామన్నారు. ఫ్రైడే- డ్రైడే, డోర్ టూ డోర్ సర్వే ద్వారా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సాయినిఖిత, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జి.శ్రీనివాసరావు, ఎంపీ హెచ్ఈఓ కృష్ణారావు, హెచ్ఎస్ రామారావు, పీహెచ్ఎన్ రాజమణి, హెల్త్ అసిస్టెంట్‌లు శ్యాంప్రసాద్, గోపాలకృష్ణ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నంలో కొండపై ఉన్న భువనేశ్వరి అమ్మవారి వార్షిక శాంతి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మండపారాధన, మూల విరాట్‌కు అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష్మీ గణపతి సహిత రుద్ర చండీ హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు అన్నసమారాధన చేశారు. రాత్రి శాంతి కల్యాణం కన్నుల పండువగా ఆలయ అర్చకుడు మురళీధర్‌శర్మ నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

- అధ్వానంగా మద్దూరు- గోసాల రోడ్డు
- భారీ వాహనాలతో మరింత ఛిద్రంగా రహదారి
- ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్న ప్రజలు
- చినుకు పడితే నరకప్రాయంగా రాకపోకలు



వణుకూరు ప్రధాన గ్రామంలో పంట కాలువను తలపిస్తున్న రోడ్డు



చినుకు పడితే అధ్వానంగా మారుతున్న వణుకూరు- మద్దూరు రోడ్డు

కంకిపాడు: క్యాలెండరులో రోజులు, నెలలు మారుతున్నాయే తప్ప.. రోడ్డు గతి మాత్రం మారటం లేదు. నాడు ప్రతిపక్షంలో ఉండగా సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన నేటి ముఖ్య ప్రజాప్రతినిధి ఈ రోడ్డు ఊసే ఎత్తడం లేదు. అసలే అధ్వానంగా ఉన్న రోడ్డు మీదుగా భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు మరింత ఛిద్రంగా మారుతోంది. చినుకు పడితే చెరువు, పంట కాలువ, బురదకయ్యలను తలపిస్తోంది. ఈ రహదారి కష్టాలకు మద్దూరు- గోసాల రోడ్డు కేరాఫ్‌గా మిగిలింది.

ఎంతో కీలకం.. అయినా నిర్లక్ష్యం

విజయవాడ- దివిసీమ కరకట్ట నుంచి మద్దూరు, వణుకూరు మీదుగా గోసాల సెంటరులో విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిని కలుపుతూ మద్దూరు- గోసాల రోడ్డు ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డు అటు దివిసీమ ప్రాంతం, ఇటు జాతీయ రహదారి నుంచి ఈడుపుగల్లు మీదుగా గన్నవరం విమానాశ్రయం చేరుకునేందుకు ప్రజలు ప్రధాన మార్గంగా వినియోగిస్తున్నారు. అలాంటి ప్రాధాన్యత గల రోడ్డును పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

అధికారంలోకి రాగానే ఏడాదిలోపు అన్నారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాది లోపు అన్ని ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. ఏడాది కావస్తున్నా రోడ్డు గతి మాత్రం మారలేదు. రోడ్డు మొత్తం పెద్ద గోతులు ఏర్పడి, మార్జిన్‌లు కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. ఇసుక క్వారీల నుంచి భారీ వాహనాల్లో రవాణా అవుతున్న ఇసుక, బుసక, గ్రావెల్ రోడ్డుపై జారిపడి మేట వేసుకుని ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. చిన్న పాటి వర్షం కురిసినా రోడ్డు మొత్తం నీరు నిలిచిపోయి బురదకయ్యగా తయారవుతోంది. ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో జారి పడి రోడ్డుపై అక్కడకక్కడా పరిచిన బండరాళ్లపై పడి గాయపడటం, వాహనాలు ధ్వంసం కావటం జరుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

నాడు సెల్ఫీలు.. నేడు నిర్లక్ష్యం

నాడు ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుత ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగి మరీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టించారు. ఎంతో కీలకమైన మద్దూరు- గోసాల రోడ్డు మార్గాన్ని మాత్రం వదిలేశారు. నాడు సెల్ఫీ దిగి, నేడు రోడ్డు సంగతి పట్టించుకోకుండా ఉంటే ఎలా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే కృష్ణానది ఏటిపాయలో ఉన్న ఇసుక రవాణాకు ప్రధాన మార్గం కావటంతో ఇసుక ద్వారా వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రజల ఇబ్బందుల పరిష్కారంలో లేదంటూ పెదవి విరుస్తున్నారు.

నాడు రూ.19.50 కోట్లు కేటాయింపు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రస్తుతం సింగిల్ లైన్‌గా ఉన్న రోడ్డును డబుల్ లైన్‌గా అభివృద్ధి పరిచేలా ప్రతిపాదనలు జరిగాయి. రూ.19.50 కోట్లు నిధులు కేటాయింపులు జరిగాయి. టెండరు దక్కించుకుని కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టేందుకు ఎన్నికల కోడ్ అడ్డంకి అయ్యింది. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా వేసవి నాటికి పనులు పూర్తవుతాయని అంతా భావించారు. కూటమి ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేసి సింగిల్ లైన్‌కే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయించింది. ఇక అంతా వర్షాల సీజన్. ఇప్పటికీ నిధుల కేటాయింపుల ఊసులేదు. దీంతో ఇప్పుడప్పుడే రోడ్డుకు మోక్షం దక్కే మార్గం లేదంటూ ప్రజానీకం విమర్శిస్తున్నారు.

రూ.6.50 కోట్లతో ప్రతిపాదన

> మద్దూరు- గోసాల రోడ్డు అభివృద్ధి సింగిల్ లైన్‌కే ప్రతిపాదనలు జరిగాయి. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు రద్దు చేశారు. కొత్త ప్రతిపాదనల ప్రకారం రూ.6.50 కోట్లతో అంచనాలు రూపొందించాం. నిధులు కేటాయింపులు జరిగితే రోడ్డు పనులు త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> – మల్లికార్జున, ఏఈ, ఆర్‌అండ్‌బీ, కంకిపాడు

భూసార పరీక్షల మేరకు పంటల సాగు చేపట్టాలి



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆత్కూరు (గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో సోమవారం ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ బీ నవీన్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని చెప్పారు. దీనివల్ల కూలీల కొరత, సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఆ మేరకు పంట సాగు చేపట్టాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సాగు పద్ధతులపై దృష్టి సారించాలని చెప్పారు. వరిసాగులో వచ్చే చీడపీడల నివారణ కోసం వ్యవసాయ శాఖ సూచనలు, సలహాల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి హరీశ్ అధ్యక్షతన శాస్త్రవేత్తలు డాక్టర్ శైలజ, డాక్టర్ అనిత, జిల్లా వనరుల కేంద్రానికి చెందిన జ్యోతి, రమణి, శ్రీనివాస్, వీఏఏలు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి



కంకిపాడులో వెన్నుపోటు దినం పోస్టరు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు :



ముస్తాబాదలో పోస్టర్ ప్రదర్శిస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, నాయకులు

- రేపు కంకిపాడులో నిరసన
- వెన్నుపోటు దినం పోస్టరును ఆవిష్కరించిన నేతలు

కంకిపాడు: కూటమి పాలనలో ప్రజావంచనే తప్ప సంక్షేమం లేదని, ప్రభుత్వ మోసాలను నిరసిస్తూ ఈనెల 4న చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. కంకిపాడులోని ప్రధాన సెంటరులో వెన్నుపోటు దినం పోస్టరు సోమవారం వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో కూటమి నేతలు చేసిన ప్రచారానికి ప్రజలు మోసపోయారన్నారు. ఏడాది కాలంలో సంక్షేమం అందక పేద, మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. సాగు ప్రశ్నార్థకంగా మారిపోయి రైతులు అప్పులపాలయ్యారన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పేరుకే పథకాలు అని, అమలుకు నోచక ఆయా వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఏడాది పాలన అంతా మోసాలతో సాగిందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు ఈనెల 4వ తేదీన పట్టణంలోని అయానా ఫంక్షన్ హాలు నుంచి ప్రారంభమయ్యే నిరసన ప్రదర్శన తహసీల్దార్ కార్యాలయం వరకూ సాగుతుందన్నారు. అక్కడ నిరసన వ్యక్తం చేసిన అనంతరం అధికారులకు వినతులు అందిస్తామన్నారు. కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజాతంత్ర వాదులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి రామినేని రమాదేవి, జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ మేధావుల విభాగం అధ్యక్షుడు పిడికిటి రామకోటేశ్వరరావు, జగన్నాథపురం సర్పంచ్ పిన్నబోయిన శ్రీనివాసరావు, కంకిపాడు ఎంపీటీసీ కోనా కిషోర్, నాయకులు భీమవరపు నాగిరెడ్డి, నక్కా శ్రీనివాసరావు, కలపాల వజ్రాలు, మాదు రాఘవేంద్రరావు, షేక్ కరీముల్లా, మల్లు, చోరగుడి మహేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తాళ్లూరి మరియబాబు, కోలవెన్ను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 4న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పిలుపునిచ్చారు. సోమవారం ముస్తాబాదలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిందని, సూపర్ సిక్స్ అబద్ధపు హామీలతో కూటమి అధికారంలోకి వచ్చి ప్రజల ఆశలకు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిన సందర్భంగా గన్నవరంలో జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని, నాయకులు రాంబాబు, కూరేటి రాజేష్, తంబి, నరేష్, మధుబాబు, జాన్‌పాల్, పండు, ఆరిఫ్, బబ్లూ, కైలే శ్రావణ్, పల్లి ఆంజనేయులు, పల్లి వీరయ్య, దిలీప్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు కోరుతూ సీపీఐ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

పెనమలూరు: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు పి.జమలయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిపిస్తే సూపర్‌సిక్స్ హామీలు వెంటనే అమలు చేస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పేదలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. రూ.5 లక్షలతో ఇళ్లు నిర్మిస్తామని అన్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, చదువుకునే పిల్లలకు ఇంట్లో ఎంతమంది ఉన్నా ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే పాలకులు ఢిల్లీ చుట్టూ తిరగటమే తప్ప ప్రజలకు న్యాయం చేయలేదని ఆరోపించారు. పెనమలూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారన్నారు. అయితే ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణకు సీపీఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మోతుకూరి అరుణ్‌కుమార్, వాటపల్లి ఇజ్రాయేల్, వీరాబత్తిన బాలస్వామి, కె.కోటేశ్వరమ్మ, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణం చేస్తుండగానే ఆక్రమణలు



పోరంకిలో డ్రెయినేజీని ఆక్రమించి చేసిన నిర్మాణం

పెనమలూరు: రోడ్డు పక్కన ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేకుండా ఉంది. పోరంకి- నిడమానూరు రోడ్డులో డ్రెయినేజీ పనులు జరుగుతుండగానే ఆక్రమణ దారులు ఏకంగా డ్రెయినేజీని ఆక్రమించే పనిలో ఉన్నారు. అధికార పార్టీ నేతల అండదండలతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోరంకి- నిడమానూరు రోడ్డు ఇరు పక్కల ఆక్రమణల కారణంగా డ్రెయినేజీ పూర్తిగా కనపడకుండా పోయింది. దీని కారణంగా చినుక పడితే రోడ్డుపై రెండు అడుగుల మురుగు నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా ఆక్రమణలు తొలగించటంలో పాలకులు చర్యలు తీసుకోవటం లేదు. ఈ కారణంగా సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా నిడమానూరు రోడ్డులో డ్రెయినేజీ పనులు జరుగుతుంటే టీడీపీ నేతల అండదండలతో ఓ వ్యాపారి డ్రెయినేజీని పూడ్చి కొబ్బరి బోండాల షాపు పెట్టడానికి రంగంలోకి దిగాడు. మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు నిరోధించటానికి చర్యలు తీసుకున్నారు. అయితే తమకు టీడీపీ నేతల అండదండలు ఉన్నాయని వ్యాపారి మునిసిపాలిటీ సిబ్బందిని బెదిరించే యత్నం చేశాడు. ఆక్రమణలు సిబ్బంది ఆపినా పూర్తిగా తొలగించలేదు. ఆక్రమణలు నిరోధించక పోతే గతంలో వలె డ్రెయినేజీ పూర్తిగా ఆక్రమణలకు గురై మురుగునీరు రోడ్డుపై నిలిచిపోతుందని గ్రామస్తులు అంటున్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు శిక్షణ



వణుకూరు గ్రంథాలయంలో కథలు చెబుతున్న విద్యార్థులు

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల కథలు చెప్పారు. విద్యార్థుల్లో మానసిక ఆనందం కోసం పలు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి భారతి వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు యోగాలో శిక్షణ

ఉయ్యూరు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు యోగా, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్ కోరాడ శ్రీలక్ష్మి విద్యార్థులతో యోగాసనాలు వేయించి ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు.

ఆంగ్లంపై పట్టుసాధించాలి

కంకిపాడు: ఆంగ్లంపై పట్టు సాధించాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో సోమవారం ఆంగ్లంపై శిక్షణ ఇచ్చారు. స్పోకెన్ ఇంగ్లిష్‌పై పట్టు సాధించటం వల్ల కలిగే ప్రయోజనాలను రిటైర్డు పోస్టుమాస్టర్ కాటూరి శ్రీహరి వివరించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు అందమైన బొమ్మలను గీసి ప్రతిభ చాటారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

పుస్తక పఠనం ఎంతో మేలు

గన్నవరం రూరల్: పుస్తక పఠనంతో విద్యార్థులు చదువుల్లో పురోగతి సాధిస్తారని ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి అన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా సోమవారం 36వ రోజు విద్యార్థులకు పుస్తక పఠనం పోటీలు నిర్వహించారు. విజేతలను ఎంపిక చేశారు. చెస్, క్యారమ్స్, లూడో ఆటలు నిర్వహించి విద్యార్థులు ప్రతిభకు ప్రోత్సాహాన్ని ఇచ్చారు. పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల నిర్ధారణ

గన్నవరం: గన్నవరం- నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి చేపల మార్కెట్ వరకు సర్వే నిర్వహించి ఆక్రమణలు నిర్ధారించినట్లు తహసీల్దారు కే వెంకటశివయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణ రెండు సర్వే నంబర్లలో జరుగుతున్నట్లుగా పేర్కొన్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఆర్ఎస్.నం:451, చేపల మార్కెట్ వరకు ఆర్ఎస్.నం:450 ఉన్నట్లు తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద 138 అడుగులు ఉన్న రోడ్డు విస్తీర్ణం, మూడుబొమ్మల సెంటర్ వద్ద 97 అడుగులు, తహసీల్దారు ఆఫీస్ వద్ద 98 అడుగులు ఉన్నట్లుగా వివరించారు. తహసీల్దారు ఆఫీస్ ఎదురుగా 83 అడుగులు, పోలీస్‌స్టేషన్ వద్ద 76 అడుగులు, స్టేట్ బ్యాంక్ ఏటీఎం వద్ద 59 అడుగులు ఉన్నట్లుగా తెలిపారు. రోడ్డు ఆక్రమణల తొలగింపు అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లుగా ఆయన పేర్కొన్నారు.

బంతి తగిలి మహిళ కంటికి గాయం

పెనమలూరు: బాలుడు విసిరిన బంతి మహిళకు తగిలి కంటికి తీవ్ర గాయమవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు గ్రామానికి చెందిన కె.సత్యవతి ఇంట్లో పనులు చేసుకుంటుండగా పక్క ఇంట్లో ఉంటున్న బాలుడు బంతి విసిరటంతో అది వచ్చి సత్యవతి కంటికి తగిలింది. కంటిని పరీక్షించిన వైద్యులు కంటికి ఆపరేషన్ చేయాలని తెలిపారు. బాధితురాలి కుమార్తె ధనలక్ష్మి బాలుడి తల్లిదండ్రులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. తమకు న్యాయం చేయాలని బాధితురాలి కుమార్తె ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

త్వరలో ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూతనంగా నిర్మించిన హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టామని గన్నవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శివాజీ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. బస్టాండ్‌లోనికి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. బస్టాండ్‌లో నూతనంగా త్రీ సీటర్ బెంచీలు, ఫ్యాన్లు, బస్సుల ప్రయాణ వేళల సమాచార పట్టిక, స్టూడెంట్ బస్‌పాస్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆర్టీసీ బస్సు రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులతో మాట్లాడి సదుపాయాలపై ఆరా తీశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అధిక లాభాలను ఆర్జించవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి.సుధారాణి అన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులో కేవీకే ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వరి, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటల సాగులో రైతులు పాటించాల్సిన మెలకువలు, సస్యరక్షణ చర్యలు, సాంకేతిక పనిముట్ల, పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కల్పించారు. భారత ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ (పెదవేగి) శాస్త్రవేత్త డాక్టర్ కల్యాణ్ బాబు, కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి మాట్లడారు. అనంతరం వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు రైతులతో చర్చాగోష్టి నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇఫ్కో ఆధ్వర్యంలో వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం కె.పార్థసారధి, ఎంఏవో జొన్నల గడ్డ భవాని, మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, బొమ్ములూరు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థిని ఎంపిక



నున్న(విజయవాడ రూరల్): నున్న వికాస్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ (సీఎస్ఈ) 2021- 25 బ్యాచ్‌కి చెందిన అభిరమ్య దీపిక కాగ్నిజెంట్ కంపెనీలో జరిగిన మౌఖిక పరీక్షలో ప్రతిభ కనబర్చి సాఫ్ట్వేర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. అభిరమ్య దీపిక ప్రాంగణ ఎంపికలో కూడా వార్చ్ సంస్థలో కూడా ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. వికాస్ కాలేజీలో చదివిన విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి, ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని కాలేజీ డైరెక్టర్ ఎస్.కీర్తిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావులు అభిరమ్య దీపికను సోమవారం కాలేజీలో అభినందించారు. కళాశాలలో చేయించిన క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాజెక్ట్ ఉపయోగపడిందని, అందువలనే కాగ్నిజెంట్ కంపెనీకి ఎంపికైనట్లు విద్యార్థిని తెలిపారు.

విత్తన నమూనాల సేకరణ

రామవరప్పాడు: వరి విత్తనాలు సబ్సిడీ ధర్పై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఎంఏవో బి.రంగనాథ్ బాబు తెలిపారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని ఏపీ సీడ్స్‌లో సోమవారం వరి విత్తనాలను నాణ్యత పరిశీలన నిమిత్తం సేకరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ బాబు మాట్లాడుతూ విత్తన నాణ్యత విశ్లేషణ నిమిత్తం బీపీటీ 5204 ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 విత్తనాల నమూనాలను సేకరించామన్నారు. ఎంటీయూ 1318 రకం 25 కేజీల బస్తా రూ.950, ఎంటీయూ 1061 రూ.1150 వంతున సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పంట కాలువల్లో పూడిక తీత

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువ పరిధిలోని పంట కాలువల్లో పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. తొలుత ఈ పనులను ఏలూరు కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ జాస్తి విజయభూషణ్‌కుమార్ ప్రారంభించారు. సంఘ సభ్యులు చెరుకూరి బాపయ్య చౌదరి, పల్లి ధర్మానందం, బీ అప్పారావు, అన్నే అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.